క్లుప్తంగా

ఆకట్టుకున్న వెల్‌కమ్ ఫ్రేమ్


తిరుమాలిలో వెల్‌కమ్ ఫ్రేమ్‌తో ఉపాధ్యాయులు

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఆకర్షించేందుకు గాను తయారు చేసిన వెల్‌కమ్ ఫ్రేమ్ ఆకట్టుకుంది. సర్కారీ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తిరుమాలి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు తూమురౌతు శ్రీనివాసరావు వినూత్నంగా స్వాగత ద్వారం తయారు చేశాడు. ఇది విద్యార్థులను విశేషంగా ఆకర్షిస్తోంది. హెచ్‌ఎం బాబూరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు పాఠశాలలో 41 మంది విద్యార్థులను చేర్చుకున్నట్టు తెలిపారు. స్వాగత ద్వారం తయారు చేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, రాజ్యలక్ష్మి, సత్యగౌరి, రాజ్యకళ, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


తునిలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రూపాదేవి

తుని: వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలో రెండు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ చలివేంద్రాలు పట్టణంతో పాటు గ్రామాల నుంచి వచ్చే బాటసారుల దాహార్తిని తీరుస్తాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


రాము కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కురందాసు రాంబాబు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ తుని నియోజకవర్గ అధ్యక్షుడు లంక కృపానందం, ఆ పార్టీ నాయకులు గారా శ్రీనివాస్, చుక్కల ప్రసాద్, సూరిబాబు తదితరులు సోమవారం రాంబాబు ఇంటికి వెళ్లి అతని తల్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిగటాల వీరబాబు, గరిసింగు దొరబాబు, జిగటాల కోటసత్తిబాబు, తరిపే సత్యనారాయణ, బండి నానిబాబు, తోలెం విజయ్‌రాజ్, నేతల శివ తదితరులు పాల్గొన్నారు.

10న యనమల 42 వసంతాల ప్రస్థానం సభ

తుని రూరల్: ఈ నెల 10న యనమల రామకృష్ణుడి 42 వసంతాల రాజకీయ ప్రస్థానం సభ నిర్వహిస్తున్నట్టు కూటమి నాయకులు తెలిపారు. స్థానిక గెడ్లబీడు సాయివేదికలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు మాట్లాడారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు జరిగే యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం


కొత్తపేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, వేలంక, గెద్దనాపల్లి గ్రామాల్లో రూ. 2.90 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. వాటితో పాటు జగపతినగరంలోని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ నిధులతో నిర్మించిన రెండు గోకులం షెడ్లను ప్రారంభించారు. రాజుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కాకాడ కుమారికి ప్రధానమంత్రి అజయ్ ఉన్నతి స్కీమ్ ద్వారా మంజూరైన రూ.లక్ష సబ్సిడీ రుణం చెక్కును అందజేశారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య సేవలు నిల్.. అవస్థలు ఫుల్

- ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలిన విలేజ్ క్లినిక్‌లు
- అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- గ్రామాల్లో ప్రజలకు అందని వైద్యసేవలు


ఎ.మల్లవరంలో అసంపూర్తిగా నిలిచిపోయిన విలేజ్ క్లినిక్ భవన నిర్మాణం


రౌతులపూడి-2లో అందుబాటులోకి వచ్చిన విలేజ్ క్లినిక్ భవనం

రౌతులపూడి: గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌లు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. గ్రామాల్లోని ప్రజలకు స్థానికంగా వైద్యసేవలు అందించేందుకు నాలుగేళ్ల క్రితం మంజూరు చేసిన విలేజ్ క్లినిక్ భవనాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో చిన్నపాటి జలుబు, జ్వరం, బీపీ, షుగర్ వంటి పరీక్షలకు మండల కేంద్రాల్లోని సీహెచ్‌సీలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విలేజ్ క్లినిక్‌ల లక్ష్యం

గ్రామాల్లోని ప్రజలకు స్థానికంగా వైద్య సేవలు అందించడంతో పాటు ప్రమాదకర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం కోసం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. జలుబు, జ్వరం వంటి వ్యాధులను గుర్తించడం, బీపీ, షుగర్, రక్తనమూనాలు సేకరించి పరీక్షించి చికిత్స అందించడం ద్వారా వైద్య సేవలను పటిష్ట పరచడం విలేక్ క్లినిక్‌ల లక్ష్యం. పలు గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల భవనాలను పూర్తిచేయకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందడం లేదు.

భవనాలు ఇలా..

మండలంలోని 14 విలేజ్ క్లినిక్ భవనాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగేళ్ల క్రితం ఉపాధి హామీ, జాతీయ హెల్త్ మిషన్ నిధులు ఒక్కొక్క భవనానికి రూ.20.80 లక్షలు కేటాయించారు. పారుపాక, గిడజాం, రౌతులపూడి-2 సచివాలయాల పరిధిలో మాత్రమే పూర్తిస్థాయిలో భవనాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ములగపూడిలో భవనం పూర్తిచేసినా ఫ్లోరింగ్, డోర్స్, కిటికీలు, శానిటరీ విభాగం వంటి పనులు పూర్తిచేయక నేటికీ అందుబాటులోకి రాలేదు. ఎస్.అగ్రహారంలో భవనానికి శ్లాబ్ మాత్రమే వేశారు. బలరామపురం, రాజవరంలో శ్లాబ్ వరకు నిర్మాణాలను పూర్తి చేసి వదిలేశారు. పి.చామవరంలో నిర్మించిన భవనానికి ఎలక్ట్రికల్ పనులు పూర్తికాక అందుబాటులోకి రాలేదు. ఎ.మల్లవరం, ఎస్‌ఎస్ పట్నంలో రూఫ్‌లెవెల్ వరకూ నిర్మాణాలు పూర్తిచేసి అసంపూర్తిగా వదిలేశారు. లచ్చిరెడ్డిపాలెంలో భవనానికి పునాది మాత్రమే నిర్మించారు. గుమ్మరేగుల, గంగవరం, శృంగవరం గ్రామాల్లో నేటికీ ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. ఆయా ఆయా గ్రామాల్లో విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మాణాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలేజ్ క్లినిక్ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

గ్రామంలోని ప్రజలకు వైద్యసేవలు అందించడానికి మంజూరు చేసిన విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. భవనం పూర్తి చేయడంతో పాటు స్థానికంగా ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి.

– బొద్దు నాని, స్థానికుడు, ఎ.మల్లవరం

భవన నిర్మాణాలకు చర్యలు చేపడతాం

మండలానికి 14 విలేజ్ క్లినిక్‌లు మంజూరు కాగా వీటిలో మూడు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 11 వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. మూడు భవనాల నిర్మాణాలకు నేటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. పూర్తయిన నిర్మాణాలకు బిల్స్ చేశాం. మిగిలిన పనులను కాంట్రాక్టర్లు పూర్తిచేస్తే వాటికి బిల్లులు మంజూరు చేస్తాం. వీటిని అందుబాటులోకి తీసుకురావటానికి చర్యలు చేపడతాం.

– ఎస్.మురళి, పంచాయితీరాజ్ జేఈ, రౌతులపూడి

గ్రామాల్లో అన్నసమారాధనలు

కిర్లంపూడి: మండలంలోని కొండయ్యపేట, చిల్లంగి రామాలయాల్లో నిర్వహించిన సప్తాహ మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పెంటకోట నాగబాబు తదితరులు ఉన్నారు.

ముద్దాయికి ఆరు నెలల జైలు

కోటనందూరు: ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి ఓ వ్యక్తి మరణానికి కారణమైన యువకుడికి తుని జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 జరిమానా విధించినట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. 2020 సంవత్సరంలో కొల్లు లోవరాజు అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీకొట్టడంతో మండలంలోని కాకరాపల్లికి చెందిన బంటుపల్లి జమీలు మృతి చెందారు. మృతుడి సోదరుడు బంటుపల్లి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం అశోక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. ఏపీపీ లక్ష్మీదేవి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

అందరికీ విద్యార్థి మిత్ర కిట్లు


సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు భారతి

ఏలేశ్వరం: వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో శ్రీసర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ అందజేస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు బి.భారతి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల కిట్స్ స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. స్టాక్ పాయింట్ టీమ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు యూనిఫాం, టెస్ట్, నోట్‌బుక్స్, షూస్, బెల్ట్, బ్యాగులు అందిస్తామన్నారు. వీటిని పూర్తిస్థాయిలో పాయింట్ నుంచి పాఠశాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా పరిశీలకుడు చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి, హెచ్‌ఎం గణపతిరావు, సీఆర్‌పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్/కిర్లంపూడి : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లు అందజేస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు బి.భారతి తెలిపారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లను సోమవారం ఆమె పరిశీలించారు. స్టాక్ పాయింట్ల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓలకు సూచించారు. సమగ్ర శిక్ష జిల్లా పీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు వి.రాజబాబు, వై.అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


ప్రత్తిపాడులో తేజోమూర్తుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

శంఖవరం: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు తాటాకిల్లు దగ్ధమయ్యాయి. గొనగాల పార్వతి, పల్లా లోవతల్లి కుటుంబాలు సర్వం కోల్పోయాయి. కాగా బాధిత కుటుంబాలను సోమవారం గిరిబాబు పరామర్శించి ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, రూ.5000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకూ తక్షణ సాయం అందించకపోవడం బాధాకరమన్నారు. బాధిత కుంటుంబాలను ప్రభుత్వ అధికారులు పరామర్శించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు కటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఈగల అప్పారావు, గౌతు స్వామి, లొండ రమణ, మామిడి శ్రీను, కోన రమణ, ఈగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తేజోమూర్తుల కుటుంబానికి పరామర్శ

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి తేజోమూర్తుల లక్ష్మీనరసింహమూర్తి కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సోమవారం పరామర్శించారు. సిద్ధాంతి లక్ష్మీ నరసింహమూర్తి ఇటీవల మృతి చెందారు. ఆయన కుమారుడు సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులను ముద్రగడ గిరిబాబు పరామర్శించి, మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పార్టీ నాయకులు శేరు కృష్ణ, ఏడిద రెడ్డినాయుడు, గోళ్ల జయశేఖర్, జల్లిగంపల ప్రభాకరరావు, కట్టమూరి కొండబాబు తదితరులున్నారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు


సుందరకాండ పారాయణలో పాల్గొన్న మహిళలు


సూర్య కిరణాల వల్ల లింగాకార నీడ దృశ్యం

గండేపల్లి: తాళ్లూరు శివాలయంలో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వీఎస్‌ఎస్ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కాగా సోమవారం ఉదయం సూర్యకిరణాలు స్వామివారిని తాకడంతో ఆ దృశ్యాన్ని చూసిన భక్తులు తన్మయం చెందారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా సుందరకాండ పారాయణ

జగ్గంపేట: దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక టీచర్స్ కాలనీలో సోమవారం కొత్త కాశీవిశ్వేశ్వరరావు, పుష్ప దంపతుల ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి, సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం, వాసవీ సంఘం మహిళలు సుందరకాండ పారాయణ నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరరావు దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


ప్రత్తిపాడులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

జగ్గంపేట: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్టు డాక్టర్ పీఆర్‌ఎస్‌జీ వర్మ సూచించారు. జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పురుడు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆపరేషన్ లేకుండా సాధారణ పురుడు పోసుకునేందుకు గర్భిణులు చేయవలసిన వ్యాయామాలు, తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం

ప్రత్తిపాడు: ఆరోగ్య పరిరక్షణ ముఖ్య కర్తవ్యమని, ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటిండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం గర్భిణులు మొదటి నెల నుంచి ప్రసవం అయ్యేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 15 మందికి సై టీబీ టీబీ నిర్ధారణ పరీక్ష (సైటీబీ ఏంటిజెన్ స్కిన్ టెస్ట్)లు చేశారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ అనిల్ కుమార్, వైద్యులు శ్వేత, వినీల, సీహెచ్‌సీ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్, ఐసీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

జగ్గంపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రణీత్, ఎలెక్ట్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడివరపు సురేష్, చంద్రమౌళి వెంకటశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వర్మ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకర జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాకినాడ మెడికోవర్ హాస్పిటల్ వైద్యులు కె.వంశీకృష్ణ మాట్లాడుతూ వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన జీవన విధానం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు సుజియా, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

తుని రూరల్: యువత డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.లలిత సూచించారు. సోమవారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిషేధిత మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. దేశానికి యువతే సంపదని, యువత నిర్వీర్యమైతే తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.లక్ష్మి, డ్రగ్స్ ఫ్రీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డి.సరిత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఈ నెల 9న కళాశాల ఆవరణలో ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాబ్‌మేళాకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడెటా, సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


కుక్కుటేశ్వరస్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పిఠాపురం: పవిత్ర పాదగయ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్వామివారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

వడగండ్ల వాన


గోకవరంలో కురుస్తున్న వడగండ్ల వర్షం


గోకవరంలో నేలరాలిన మామిడి కాయలను ఏరుతున్న రైతు, మహిళలు

మామిడి రైతులకు తీవ్ర నష్టం

గోకవరం: మెట్టప్రాంతమైన గోకవరం మండలంలో సోమవారం వడగండ్ల వాన కురిసింది. సుమారు అరగంట పాటు కురిసన వర్షానికి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాగా ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం మూడు గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులు, వడగండ్లతో భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు వడగండ్లు పడటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. చిన్నారులు వానలో తడుస్తూ వడగండ్లతో ఆడుకున్నారు. మరోపక్క వడగండ్ల వానతో మామిడి కాయలు నేలరాలాయి. ఇప్పటికే ప్రతికూల వాతావరణంతో తీవ్రంగా నష్టపోయిన తమను వడగండ్లు పూర్తిగా నష్ట పరిచాయని మామిడి రైతులు వాపోయారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ-2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778